క్లుప్తంగా

చెత్తను తొలగించారు



సాక్షి ఎఫెక్ట్..

జన్నారం: ఇళ్ల మధ్యన ఉన్న చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. జన్నారం మండలం పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ ధర్మారం వెళ్లే కాలనీలో పేరుకుపోయిన చెత్తపై 'ఇళ్ల మధ్యనే చెత్త–కాలనీ వాసుల చింత' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఈవో రాహుల్ స్పందించారు. వెంటనే చెత్తను తొలగించాలని ఆదేశించడంతో ఆదివారం ఉదయం చెత్తను తొలగించి శుభ్రం చేశారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



చిత్రపటం వద్ద నాయీబ్రాహ్మణుల పూజలు

దండేపల్లి: ధన్వంతరి జయంతి వేడుకలను దండేపల్లి మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కంది శంకయ్య, నాయకులు రమేశ్, తిరుపతి, సుధాకర్, సత్యం, మల్లేశ్, వెంకటేష్, రాజన్న, మొగిలి, శేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకపత్రం అందజేత



నియామకపత్రం స్వీకరిస్తున్న రమ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేడ్కర్‌నగర్ బస్తీకి చెందిన ముత్తే రమ్య అనే యువతి గ్రూపు–2 ఉద్యోగ నియామకపత్రాన్ని అందుకుంది. హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా చేతుల మీదుగా రమ్య సచివాలయంలోని జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా ఉద్యోగ నియామకపత్రాన్ని స్వీకరించారు. గ్రూపు–2లో ప్రతిభావంతంగా రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన రమ్యను ఆమె తల్లి, అన్న ప్రత్యేకంగా అభినందించి సంతోషం వ్యక్తం చేశారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..!



సీసీసీలోని ప్రొ.జయశంకర్ కాలనీ బోర్డు వద్ద...



మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న పిచ్చి మొక్కలు



చెన్నూర్ ఎనగుట్టకాలనీలో...

చెన్నూర్/నస్పూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకొని ప్రమాదాలను తలపిస్తున్నాయి. అయినా అధికారులు అటువైపు చూడడం లేదు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీనివాస టాకీస్ వెనుక రోడ్‌లో, నస్పూర్ పట్టణ పరిధి సీసీసీలోని నందనవనం పార్కు ఎదుట, పార్కు పక్కన, ప్రొ. జయశంకర్ కాలనీ బోర్డు వద్ద, చెన్నూర్ ఎనగుట్ట (ఎమ్మెల్యే కాలనీ)లో ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగినా తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ తీగలను అల్లుకున్న మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



సీసీసీలోని నందనవనం పార్కు ఎదుట...



సీసీసీలోని నందనవనం పార్కు పక్కన...

మార్కెట్లో అమ్మకాల జోరు!



కొనుగోలు చేస్తున్న మహిళలు, యువకులు

బెల్లంపల్లి: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం బెల్లంపల్లి మార్కెట్ కళకళ లాడింది. పూలు, బొమ్మరిల్లులు, ఇతర రకాల వస్తుసామగ్రి జోరుగా క్రయవిక్రయాలు జరిగాయి. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్(కాంటా) చౌరస్తా వద్ద గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన మహిళలు బంతి పూలను పెద్ద ఎత్తున తీసుకొచ్చి కిలోల చొప్పున విక్రయించగా, బొమ్మరిల్లుల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. క్రయవిక్రయదారులతో బజారు ఏరియా ప్రాంతం సందడిగా కనిపించింది. సింగరేణి తిలక్‌స్టేడియంలో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాల్లో బాణాసంచా అమ్మకం, కొనుగోళ్లు మందకొడిగా సాగాయి.

ట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజు



రాజు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ట్రాక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా అధ్యక్ష పదవి కో సం నలుగురు ట్రాక్టర్ యజమానులు పోటీ పడ్డారు. ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించేందుకు కొందరు చేసిన యత్నాలు ఫలించలేదు. పోటీ తీవ్రంగా ఉండటంతో అనివార్యంగా ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. ఆదివారం ఎన్నికలు జరగ్గా వరుకుట్టి రాజు అనే ట్రాక్టర్ యాజమాని 3ఓట్ల ఆధిక్యంతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. రాంనగర్ బస్తీకి చెందిన రాజు పోటాపోటీ ఎన్నికల్లో విజయం సాధించడంతో ప లువురు ట్రాక్టర్ యాజమానులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

చిరుధాన్యాల సాగు ఊసే లేదు!

- ఆరోగ్య చైతన్యంతో పెరిగిన వినియోగం
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

దండేపల్లి: కొన్ని దశాబ్దాల క్రితం జిల్లాలో చిరుధాన్యాల సాగుకు రైతులు ప్రాధాన్యమిచ్చేవారు. అప్పట్లో ప్రజలు కూడా వాటిని ఎక్కువగా వినియోగించేది. ఆ సమయంలో వరిసాగు విస్తీర్ణం చాలా తక్కువగా ఉండేది. ఇక వాణిజ్య పంట పత్తిసాగు అసలే లేదు. ప్రస్తుతం పత్తిసాగు స్థానంలో అప్పట్లో చిరుధాన్యాల్లో ఎక్కువగా జొన్నపంట పండించేవారు. ఆ తర్వాత సజ్జలు పండించేది. కడెం ప్రాజెక్టు నిర్మాణంతో జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట క్రమక్రమంగా వరిసాగు విస్తీర్ణం పెరిగింది. ఆ తర్వాత వాణిజ్య పంట పత్తిసాగు మొదలవడంతో, పై మూడు మండలాల్లో చిరుధాన్యాల్లో జొన్న సాగు పూర్తిగా తగ్గిపోయింది. సజ్జల ఊసే లేకుండా పోయింది. కేవలం జిల్లా కొన్ని పరిమిత ప్రాంతాల్లో మాత్రమే ఏటా యాసంగిలో కేవలం 400నుంచి 500ఎకరాల్లో చిరుధాన్యాలైన జొన్నపంటను పండిస్తున్నారు. జిల్లాలోని తాండూర్, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లో మాత్రమే జొన్నలు పండిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, వ్యవసాయ బావులు, బోర్ల ద్వారా సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో, జిల్లాలో వరి, పత్తి పంటలు లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీంతో చిరుధాన్యాల సాగు ఊసేలేకుండా పోయింది.



మేదరిపేటలో ఓ కిరాణ దుకాణంలో విక్రయానికి చిరుధాన్యాలు

ఆరోగ్య చైతన్యంతో పెరిగిన వినియోగం..

ఇటీవల ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెరుగుతుండటంతో, పోషక విలువలు గల చిరుధాన్యాలతో చేసిన ఆహార వినియోగం పెరుగుతుంది. ఫలితంగా చిరు ధాన్యాలకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. జొన్నలు, సజ్జలతో పాటుగా రాగులు, కొర్రలు తదితర చిరు ధాన్యాలకు ఆదరణ పెరిగింది. ప్రస్తుతం పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ, జొన్న రొట్టెల విక్రయం ఓ చిరు వ్యాపారంగా తయారయ్యింది. కొన్నిచోట్ల టిఫిన్ సెంటర్లలో రాగుల ఇడ్లీలు తయారు చేస్తున్నారు. వీటిని కూడా చాలా మంది ఇష్టపడుతున్నారు. కొన్నిచోట్ల రాగిజావను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఆరోగ్య రక్షణలో భాగంగా కొంతమంది ఇళ్లలో ఉదయం పూట చాయ్‌కు బదులు రాగిజావను తాగుతున్నారు. జిల్లాలో రాగులు, సజ్జల, కొర్రలు వంటి చిరుధాన్యాలు అసలే పండించడం లేదు. కేవలం జొన్న సాగు పరిమిత ప్రాంతాల్లో వందల ఎకరాలకే పరిమితమైంది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే చిరుధాన్యాలే మార్కెట్‌లో లభ్యం అవుతున్నాయి.

కేవలం జొన్నలు మాత్రమే...

జిల్లాలో చిరుధాన్యాలు పండించడం లేదు. కేవలం పరిమిత ప్రాంతాల్లో అది కూడా సుమారు 500 ఎకరాల వరకే జొన్నలు సాగు చేస్తున్నారు. అది కేవలం యాసంగి సీజన్‌లో మాత్రమే. ఎక్కువగా వరి, పత్తి పంటలవైపే రైతులు ఆసక్తి చూపుతున్నారు.
– సురేఖ, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి

పోలీసులకు సన్మానం

భీమారం: మండల కేంద్రంలోని ముదిరాజ్‌లకు చెందిన లక్ష్మీదేవర ఆలయంలో చోరీకి గురైన ఆభరణాలను ఛేదించిన పోలీసులను ఆదివారం లక్ష్మీదేవర ఆలయంలో పోలీసులను కుల పెద్దలు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ నెల 15న ఆలయంలో గుర్తు తెలియని దుండగులు తలుపులు పగులగొట్టి ఆలయంలోని అమ్మవారికి చెందిన రెండు కిలోల వెండి, రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయంలో కుల పెద్దలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సైలు శ్వేత, సంతోష్ రంగంలోకి దిగి సిబ్బంది మల్లయ్య, కిరణ్ సహాయంతో కరీంనగర్ జిల్లాలో ఇద్దరు దొంగలను పట్టుకున్న నేపథ్యంలో కులస్తులు ఆలయానికి పోలీసుల బృందాన్ని ఆహ్వానించి సన్మానించారు. ఈ సంఘటనతో పోలీసులపై మరింత నమ్మకం కలిగిందని ముదిరాజ్‌లు పేర్కొన్నారు.



సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం పెద్దలు

ఘనంగా కుబేరలక్ష్మీ సహస్ర కుంకుమ పూజలు

తాండూర్: ధనత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో కుబేర లక్ష్మీ సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ పూజారి నవీన్‌శర్మ, వేదపండితుడు వినోద్‌శర్మల ఆధ్వర్యంలో 108మంది సుహాసినలతో నిర్వహించిన ఈ కుంకుమార్చన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుటుంబం ఇంటిల్లిపాది ఆయురారోగ్యాలతో తులతూగాలని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

పంటలు కాపాడుకునేందుకు పాట్లు..!

- పంటలను ధ్వంసం చేస్తున్న అడవిపందులు
- పట్టించుకోని అధికారులు

కోటపల్లి: మండలంలోని కొండంపేట, మల్లంపేట, బొప్పారం, వెంచపల్లి, బోరంపల్లి, ఆలుగామ గ్రామాల్లో అడవిపందులు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మండలంలో అధికంగా పత్తి, వరి, మిర్చితో పాటు మొక్కజొన్న లాంటి పంటలను సాగు చేస్తారు. ఇప్పటికే కాపు దశలో ఉన్న పత్తికాయలను, పొట్ట దశలో ఉన్న వరి పంటలను అడవిపందులు నాశనం చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు ఎదగక కొంతమేర నాశనం కాగా, ఈ అడవిపందులతో రైతులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. అడవిపందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు కంటి మీద కునుకులేకుండా రాత్రిపూట పంట చేన్లల్లో పడుకునే పరిస్థితి ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. అడవిపందులను నివారించేందుకు రైతులు ఒక సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి వివిధ ధ్వనులతో కూడిన శబ్దాలను చేస్తూ బెదుర్లు పెట్టి పంట పొలాల చుట్టూ రాత్రంతా జాగరణ చేస్తున్నారు. కొందరు రైతులు పొలం చుట్టూ లైట్స్‌ను అక్కడక్కడా ఏర్పాటు చేస్తూ సోలార్‌తో పంటను కాపాడుకుంటున్నారు. రాత్రి పొలాల్లో విషపురుగుల భయం ఉన్నా కూడా పంటను కాపాడుకునేందుకు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా తమ సమస్యను తేలికగా తీసుకుంటున్నారని, అడవిపందులను చంపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు చేస్తున్నారే తప్పా తమ పంటలకు రక్షణగా నిలవడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అడవి పందుల బెడద నుంచి రక్షించాలని గ్రామాల రైతులు కోరుతున్నారు.

రైతులపై అడవిపందుల దాడులు..

కోటపల్లి మండలం విస్తరణపరంగా జిల్లాలోనే పెద్ద మండలం. పూర్తి భాగం అడవిని ఆనుకొని ఉండటంతో చేన్లు, పంట పొలాలకు అడవిజంతువుల బె డద తప్పడంలేదు. ఇటీవల కాలంలో బోరంపల్లి గ్రామానికి చెందిన దుర్గం శేఖర్ అనే రైతు తన వరి చేనును తెల్లవారుజామున చూసేందుకు వెళ్లగా అతడిపై అడవిపందుల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో ప్రాణపాయం తప్పింది. వెంచపల్లి గ్రామానికి చెందిన మహిళ తన ఇంటి సమీపంలోని మొక్కజొన్న పంటను అడవిపంది నాశనం చేస్తుండగా తరిమే క్రమంలో దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. జాతీయ రహదారిపై అడవిపంది వేగంగా వచ్చి సిరోంచ నుంచి వస్తున్న కారును ఢీ కొనడంతో అడవిపంది మృతిచెందింది. ప్రయాణికులు క్షేమంగా ఉన్నారు. ఇలా మండలంలో అడవిపందులు విచ్చలవిడిగా దాడులు చేస్తున్నా అవగాహన కల్పించాల్సిన అటవీఅధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడం ఏంటని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. ఫారెస్టు అధికారులు అడవిలోకి వెళ్లి చిన్న కట్టెను నరికితే కేసులు చేస్తామని హెచ్చరించే అధికారులు, అడవిపందులు తమ నోటికాడ ముద్దను నాశనం చేస్తుండటమే కాక, తమ ప్రాణాలను సైతం తీసేలా చేస్తున్నా అధికారులు చూస్తుండటం దారుణమన్నారు. అడవిపందుల దాడిలో గాయపడిన వారికి నష్టపరిహారం అందేలా చూడాలని, అలాగే పంట నష్టం జరిగిన రైతులకు కూడా నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



పందుల దాడిలో ధ్వంసమైన పంటలను పరిశీలిస్తున్న అధికారులు



ధ్వంసమైన వరి పంట

ఫారెస్టు అధికారులకు నివేదిక అందజేస్తాం

మండలంలో అడవిపందుల వల్ల పంట నష్టపోయిన వారి పంటలను పరిశీలించి నివేదికను అటవీ శాఖ అధికారులకు అందజేస్తాం. పరిహారం అటవీశాఖ అధికారుల నుంచి రావాల్సి ఉంటుంది.
– సాయికృష్ణరెడ్డి, ఏవో, కోటపల్లి

వ్యవసాయంలో రాణిస్తున్న 'ఆమె'

- 13ఎకరాలు కౌలుకు తీసుకొని కుటుంబాన్ని పోషిస్తున్న కళక్క



పత్తి చేనులో మందు స్ప్రే చేస్తున్న మోరె కళక్క

చెన్నూర్‌రూరల్: దుఃఖాన్ని దిగమింగుకుంటూ, బాధలని ఓర్చుకుంటూ భర్త చనిపోయినా ఆమె ఏ మాత్రం కుంగిపోలేదు. వ్యవసాయాన్ని ఎంచుకొని అహర్నిషలు శ్రమిస్తోంది. తన కుటుంబం కోసం వ్యవసాయ భూమి లేకున్నా కౌలుకు తీసుకొని మరీ వ్యవసాయం చేసుకుంటూ కష్టపడుతూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. వివరాల్లోకెళ్తే.. చెన్నూర్ మండలంలోని ఆస్నాద గ్రామానికి చెందిన మోరె కళక్క భర్త లింగయ్య అయిదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. వీరిది నిరుపేద వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు సంతానం. ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. అయినప్పటికీ ఆమె ఏ మాత్రం కుంగిపోకుండా 13ఎకరాల భూమి కౌలుకు తీసుకొని మరీ వరి, పత్తి పంటలు సాగు చేస్తుంది. మగవారికి ధీటుగా ఆమె పంట చేలో నాటు పెట్టడం, కలుపు తీయడం, మందులు స్ప్రే చేస్తుంది. కొడుకు డ్రైవింగ్ చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నాడు. కూతురిని బీటెక్ చదివిస్తోంది. ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ అన్ని ఒడిదుడుకులను తట్టుకుంటూ వ్యవసాయం చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ అందరికి ఆదర్శంగా నిలుస్తుంది.

లక్ష్మీదేవర ఆలయంలో కుంభాభిషేకం

భీమారం: మండల కేంద్రంలోని లక్ష్మీదేవర ఆలయంలో ఆదివారం కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ఇటీవల దుండగులు దోపిడీ చేసి ఆలయాన్ని అపవిత్రం చేయడంతో, తిరిగి సంప్రోక్షన కార్యక్రమంలో భాగంగా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ మేరకు పూజారి ప్రవీణచార్యులు నేతృత్వంలో ఆలయాన్ని శుద్ధి చేసి అనంతరం 21కలశాలకు పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనాన్ని తిరిగి ప్రారంభించారు. అర్చకులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చెట్టును తొలగించండి!

వేమనపల్లి: మండల కేంద్రం నుంచి మంగనపల్లికి వెళ్లే రహదారిపై బస్టాండ్ వద్ద ఉన్న ఎండిన వేపచెట్టు ప్రమాదకరంగా ఉంది. పక్కనే పాఠశాల, బస్టాండ్ ఉండటంతో రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే చెట్టును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాకోను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల శ్రీపద్మల్‌పురి కాకో అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. దండారి ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు.